# కట్టు కథ

బ్రహ్మచారి ముదిరినా, బెండకాయ ముదిరినా పనికిరావురా అన్నయ్యా!

తనకంటే మూడేళ్ళు చిన్నదైన చెల్లి - ఆరిందలా ఉడికిస్తూంటే జనార్ధనంలో అలజడి రేగుతుంది. ఆమాటలు గుర్తుకొచ్చినప్పుడల్లా తన నరాల్ని గ్రైండర్లో వేసి రుబ్బుతున్నట్టనిపిస్తుంది. తనమీద తనకే విశ్వాసం సడలి పోతుందొక్కోసారి.

రక్తం పంచుకు పుట్టిన చెల్లి, తన చేయిపట్టుకు నడిచిన ముద్దుల చెల్లి— చిన్నప్పుడు ఎన్ని మాటలన్నా ఏమనిపించేది గాదు, కాని అదే చెల్లి ముగ్గురు పిల్లల్ని భర్తను ముందేసుకుని తన నంత మాటంటే తన తల తీసేసినంత పనౌతుంది.

తోసుకొస్తున్న నవ్వునాపుకుంటున్న బావ వాలకం కవ్వింపులు విసిరేస్తుంది.

'చూడు జనార్థనం! నువ్వూ, నేను సమ వయస్కులం - ఇంచుమించు ముప్పై వసంతాల్ని ముచ్చటగా దాటేశాం. నేనేమో పిల్లల కోడినై పోయాను నువ్వేమో పెళ్ళి చూపుల్లో సెంచరీ సాధించావు వందమందిలో నీకే పిల్లా నచ్చలేదంటే ఏమనుకోవాలీ? పెళ్ళి కావాల్సిన అబ్బాయిలంతా నీలాగే తయారైతే ఇహ ఈ

లోకంలో పెళ్ళిళ్లేకావు. ఏ ఉద్యమం లేకుండా జనాభా సమస్య తీరిపోతుంది....?

బావ ఉపన్యాస వారవడికి చెవులప్పగించడం మినహా జవాబిచ్చేందుకు పాయింట్స్ దొరకవు.

అదేమిటో....కాలికి బలపం గట్టుకుని తిరుగుతూ ఎన్ని సంబంధాలు చూచినా ఏదీ అతకలేదు. తన ఊహా సుందరి ఏ అమ్మాయిలోనూ కనబడలేదు. కొంతవరకు సరిపెట్టుకున్నా తాను నచ్చిన అమ్మాయి తనను నచ్చలేదు. ఇద్దరికీ నచ్చితే కట్నం నచ్చలేదు.

వంద ఒకటోసారి కట్నం కండిషన్ సడలించాడు. సంబంధం ఖాయమైన వారం రోజులకు కబురొచ్చింది.

'మేమిస్తామన్న కట్నానికే అబ్బాయి ఒప్పుకున్నాడంటే దాని వెనకాల ఏదో లొసుగు ఉండుంటుంది. కాబట్టి వంద సంబంధాల్లో ఏది కుదరలేదు. మాగ్గూడా ఈసంబంధం అవసరంలే'దని.

ఆ తర్వాత రెండేళ్ళదాకా అసలు సంబంధాలే రాలేదు. తాను చొరవ తీసుకుని ప్రయత్నించినా ఫలితం శూన్యమైంది.

....నాకిహ పెళ్ళికాదు జీవితాంతం ఒంటరిగా గడిపెయ్యాల్సిందే. చచ్చినా ఏడ్చేవారెవ్వరుండరు.

వృద్ధాప్యంలో జీవన సంధ్యా సమయం ఒంటరిగా ఆయోమయ అన్న కవి వాక్కు అక్షరాలా నిజమై తీరుతుంది.

మెదడు పొరల్లో ఆలోచనలు పాములా సుడులు తిరుగుతున్న సమయంలో ఆప్తమిత్రుడు ముకుందరావు ఆపద్బాంధవుడయ్యాడు. ఓ సంబంధం పట్టుకొచ్చి జనార్ధనంలో తిరిగి ఆశాలత చిగురించింది. కళ్ళలో పున్నమి వెన్నెల తరంగాలు తళుక్కు

మన్నాయి. అలవాటు ప్రకారం.

తన పూర్వీకుల చరిత్రనంతా చెప్పి వెంటబెట్టు కొచ్చాడో పెద్ద మనిషిని ముకుందరావు, అమ్మాయి తాలూకు విషయాలన్నీ పూస గుచ్చినట్టు చేప్పాడా పెద్ద మనిషి నిర్మొహ మాటంగా.

అతని సాహసానికి జోహార్లర్పించాలన్పించింది కాని అప్పుడే అంతపని చెయ్యొద్దని మందలించిందేదో అనుమానం. ఆ అనుమానం పెనుభూతం కాక ముందే

'ఈ పరిస్థితి నీచెల్లికే ఎదురైతే నువ్వేం చేసే వాడివిరా!' సూటిగా అడిగాడు ముకుందరావు.

...నిజమే....విధి బలీయం. పరిస్థితులకు తలవంచక తపవెవ్వరైనా.

అనుమానం తాలూకు ఆనవాళ్లు దూదిపింజల్లా విరిగి పోయినై.

మర్నాడే ఆఫీసుకు సెలవు చీటీలు పంపించి అమ్మాయిని చూచేందుకు బయల్దేరారు. జనార్దనంకు థ్రిల్లింగ్గా ఉంది.

వర్షాల్లేక వరుసగా నాలుగు సంవత్సరాలు నీటి బొట్టుకు నోచుకోని చెరువులో కుంభ వృష్టి కురిసినట్టనిపించింది. నవనాడులలో తిరిగి కొత్త రక్తం ప్రవహిస్తుంది.

ఇద్దరు మిత్రుల్ని మోస్తున్న వాహనం ఆ ఊరి వైపు పరుగులు తీస్తుంటే మరుగున పడిన ఊహాసుందరి సరికొత్తగా అలంకరించుకుని ప్రత్యక్షమైంది. ఊహా లోకంలో.

మిలమిల్లాడే సుందరి కళ్ళలో తెలివైన వెలుతురుంది. చేతిలో చెయ్యేసి ఆకుపచ్చని మైదానాలలోకి తీసికెళ్ళింది. సెల

యేరు గలగలలతో పోటీ పడుతూ, గలగలా నవ్వుతూ గిలిగింతలు పెడుతోంది. ఏవేవో కబుర్లు చెబుతూ ఆనంద డోలికలూగిస్తోంది....

....'ఇంత దూరమొచ్చినాం ఒక్క మాటైనా మాట్లాడవేం రా! నువ్వు నా వెనక కూర్చుంటే కొన్ని కిలోల లగేజి మోసుకెళ్తున్నట్టుందే కాని ప్రాణమున్న మనిషిని మోసినట్టు లేదు' అన్నాడు ముకుందరావు ఊరిబయట స్కూటర్‌కు బ్రేకువేసి 'అదో మామిడి తోపు' బాట కిరు పక్కలా వరుసలలో ఉన్నాయి చెట్లు.

జనార్దనం ఊహాసుందరి హుషారైంది.

"ఆబ్బె....ఏంలేదురా, పద! ఆపావెందుకూ?" అన్నాడు మత్తుగా, గమ్మత్తుగా.

ఆకురాలు కాలానికి కాలం చెల్లిపోయిందప్పుడప్పుడే. చిరునవ్వులు చిందుస్తున్న మామిడి గున్నలు చిగురు పచ్చ పీతాంబరాలు ధరించి కులాసాగా తలలూపుతూ కబుర్లు చెప్పుకుంటున్నాయి. చల్లని గాలి ఒంటికి హాయినిస్తోంది.

స్కూటర్ స్టార్టు చెయ్యబోతుంటే 'అగండాగండి' అంటూ ఇద్దరు మనుషులు పరుగెత్తు కొస్తున్నారు దారి కడ్డంగా.

బుర్ర మీసాలు, సిల్కు చొక్కా, మల్లుపంచ మనిషి నోట్లో లంకపొగాకు చుట్ట గుప్పుగుప్పు మంటోంది. నడక వేగం తగ్గించి ఆగాడాయన రైలింజనులా. పాంటూ, షర్టులో పొట్టి గుమ్మడి కాయలాగున్న యువకుని వేళ్ళ మధ్య అంటించిన సిగరెట్ నలిగి పోతోంది.

'ఎందుకూ....?' ముకుందరావు గొంతులో అసహనం ధ్వనించింది. తప్పుకొమ్మని సైగ చేశాడు కళ్ళతో

"మందేవూరు బాబూ...." మల్లుపంచె మందహాసం.

'ఎందుకంట?' తప్పుకోనందుకు కోపమొచ్చింది

"మీరు చెప్పకున్నా మాకు తెల్సుగానీ, మీ ఇద్దరిలో పెళ్ళి చేసుకోబోయే దెవరూ?" పాంటువాలా పదహారు పళ్ళు బయట పడినై

'ఎందుకో తెలిశాక, ఎవరైతే మీకెందుకూ?"

'అబ్బ....చెప్పండి బాబూ!' కోరస్. వాళ్ళిద్దర్నీ నరికి పోగులు పెట్టి ఆ పోగుల మీంచి స్కూటర్ తీసికెళ్ళాలనిపించింది ముకుందరావుకు.

'నేనే........' అనేశాడు జనార్ధనం స్కూటర్ దిగి ముందుకొచ్చి ధైర్యంగా.

'చాలామంచిది బాబూ!' ముకుందరావు చెవిదాక వెళ్ళి 'ఆ అమ్మాయి గత చరిత్ర తెలుసా మీకు?' అడిగాడు మల్లుపంచ అంతకంటే పెద్ద రహస్యం ఇంకోటి ఉండబోదన్నట్టు. ఆ ప్రశ్న స్పష్టంగా వినబడింది జనార్ధనంకు.

'ఏమి చరిత్రా' రెండునోర్లు తెరుచుకున్నా యొకేసారి వానాకాలం గోండ్రు కప్పల్లా.

చూడబోతే మర్యాదస్తుల్లాగున్నారు ఎలా చెప్పాలబ్బా.... మల్లు పంచమొహం పంచరంగుల చిత్రమై పోతుంది.

'చెప్పాలి బాబాయ్. పాపం వీళ్ళ మొహం చూస్తే చాలా మంచి వాళ్ళలా కన్పిస్తోంది. పరోపకారార్థం మిదం శరీరం కదా! మనకు తెలిసిన విషయాల్ని వీళ్ళ చెవిలోవెయ్యడం గ్రామపెద్దగా మీ కర్తవ్యం' పాంటువాలా కాస్త దమ్ము తీసుకుని "అబద్దం చెబితే తప్పుగాని నిజంచెబితే తప్పేముంది?" అన్నాడు

ఇంకా ఆలస్యం చెయ్యడమెందు కన్నట్లు.

జనార్ధనం ముకుందరావు మొహాల్ని అయోమయం కప్పే సింది. మల్లుపంచ లంకపొగాకు చుట్టను నేల మీద పడేసి.

"గత సంవత్సరం ఆ అమ్మాయి నెవరో కిడ్నాపింగ్ చేసుకుపోయి నాల్రోజులుంచుకుని వదిలేశార్ట. ఆ నాల్రోజులూ.... పాపం....దారుణంగా రేపింగ్ చేశార్ట దుర్మార్గులు. ఆడ కూతురు ఉసురు బోసుకున్న రాక్షసుల పాపం ఊరికే పోతుందా! కాని. అమ్మాయి శీలం" ఇంకేదో అనబోతూ ఆగిపోయాడు. దగ్గుతెర ముంచుకు రావడంతో. ఆ అమ్మాయంటే తనకెంతో అభిమాన ముందని చెప్పాలనుకున్నాడు.

'చూస్తూ చూస్తూ ఆ చెడిపోయిందాన్ని ఈ అమాయకునికి కట్టబెట్టాలనుకున్నారా పాపాత్ములు?' పాంటువాలా జనార్ధనం ముకుందరావుల మధ్య నిలబడి 'ఆలాంటి పిల్ల మీ కెందుకండీ! ఈ అబ్బాయి కోఅంటే కోటి మంది అమ్మాయిలు క్యూలో నిల్చుంటారు.' పొగడ్తలు విసరనారంభించాడు.

'అరె....అలాగా! మాకా సంగతే తెలీదే!'

'హమ్మా-అంతపని జరిగిందా?' ఇద్దరి మిత్రుల మాటలకు సంతోషించి 'హా'నని బుర్ర లూపారు, చూపులో జాలి చిలకరిస్తూ. కొన్ని నిముషాలు నిశ్శబ్దంలో కూరుకుపోయాయి. చెట్టు కొమ్మల సందులోంచి తొంగి చూస్తున్న సూర్యకిరణాలు బలం పుంజుకుంటున్నాయి.

'ఐతే.... వచ్చిందారి పెళ్ళడమే క్షేమమా?' అడిగాడు జనార్ధనం అదోలా చూస్తూ.

'అంతే కద బాబూ?' తేల్చేశాడు మల్లుపంచ అతని బుర్రమీ సొల్లోంచి కొన్ని పళ్ళుతొంగి చూచా యోక్షణం.

థాంక్సండీ....! స్కూటర్ స్టార్టు చేశాడు ముకుందరావు పెదాల మీద చిరునవ్వులు మొలిపించి

'చాలా మేలు చేశారండీ' వెనక కూచున్నాడు జనర్దనం స్కూటర్ ఊళ్ళోకే దూసుకు పోయింది మల్లుపంచ పాంటువాలా ల కంట్లో దుమ్ముకొట్టి.

విచిత్ర సంఘటనను ప్రత్యక్షంగా చూచినా మామిడి గున్న లూ, చిగుర్లూ విరగబడి నవ్వుతున్నాయి.

* * *

అమ్మాయి గ్లామరస్‌గా ఉంది. ఆవిడ ఆవయవాల పొంది కకు చకితుడై పోయాడు జనార్ధనం. పొద్దు తిరుగుడు పూవులా తలెత్తి ఒక్క క్షణం ముడుచుకు పోయింది. మరోసారి కన్నెత్తి జనార్ధనం ఆపాదమస్తకం పరిశీలించి చిన్నగా నవ్వింది. అ నవ్వు జనార్ధనంలో జడంగా వడున్న శక్తుల్లో చైతన్యం నిం పింది. జరిగిపోయిన రోజులు.... జ్ఞాపకాల పరదాల్లో దోబూచుడా యి. ఎందరో అమ్మాయిల్ని చూచిన అనుభవముంది కాని ఇలాం టి అనుభూతి ఎక్కడా కలుగలేదు

తనూ, ఆవీడా భుజాలమీద చేతులు వేసుకుని వర్షంలో తడుస్తూ పరుగెత్తుతుంటే ఎంత బావుంటుందో....!

కథలు చెప్పగల ఆవిడ కలువ కళ్ళల్లో కరిగిపోతూ ఓ జీవి తం కాలం గడిపేస్తే.......!

మద్దిఃంతి పూవులా విచ్చుకున్న మొహమ్మీద గండు తు-

మ్మెదల్లా కదలాడే కళ్ళను మూసేసి గమ్మత్తు చేస్తే......!

స్వగతంలోని భావదీప్తులు అకాశాన్నంటు కుంటున్నాయి.

సింహకిశోరంగా బలిష్టంగా ఉన్న జనార్ధనం ఆకారం, తారాపువ్వల్లా దూసుకు పోతున్న అతని చూపులు ఆవిడ నలరిస్తున్నాయి.

ఆవిడ ఎర్రని పెదాల మీద పూచిన చిరునవ్వు మెల్లిగా ఎగబాగి బుగ్గల్ని రాగరంజితం చేసింది. అ తర్వాత మరింత పైకి పాకి కళ్ళల్లో కలిసి పోయింది.

'మీ పేరు .......!' అడిగాడు జనార్ధనం.

'అమాహ్య'....అంది ఆ గొంతులో కొన్ని కోయిలల కోరస్ గానముంది.

'ఎంత వరకు చదివారు?'

'ఇంటర్‌పాసై మానేశాను' తియ్యగా పలికింది.

ఈవిడ కూడా దక్కకుండా పోదుగదా! అనుమానం మొలకెత్తి భయపెట్టింది.

"నేను....నచ్చానా....?'' అడిగేశాడు గబుక్కున.

అనూహ్య తల సిగ్గుల భారంతో వంగి పోయింది.

గుండెల నిండా ఊపిరి పీల్చి ముకుందరావు వైపు చూశాడు తృప్తిగా. ఆ చూపు కొరకే ఎదురు చూస్తున్న ముకుందరావు 'మా వాడికి మీ అమ్మాయి నచ్చిందండీ' అన్నాడు గర్వంగా అమ్మాయి తండ్రితో.

అనూహ్య తండ్రి మొహం పుచ్చ పూవులా విచ్చుకుంది. తల్లి గుండెలోంచి తీపి నిట్టూర్పు వెలువడింది. కళ్ళు ఆనందంతో చిప్పిల్లాయి.

మాట్లాడాల్సిన ముఖ్య విషయాలన్నీ మాట్లాడారప్పుడే ఆలస్యం అమృతం విషమౌతుందేమోననే జంకుతో.

* * *

అనూహ్య అనూహ్యంగా జనార్ధనం అర్ధాంగైంది. ఊహా సుందరి స్థానాన్ని ఆక్రమించింది- అనాయాసంగా

పదో తరగతి పరీక్ష పదిసార్లు తప్పి పదకొండోసారి ఫస్టుక్లాసులో పాసైనట్టు ఫీలయాడు జనార్ధనం.

గత పదేళ్ళలో ఎన్నోసార్లు పెళ్ళి చూపులకు తయారైంది అనూహ్య. చూచేందుకదిగో వస్తారు, ఇదిగో వస్తారని ఎదిరిచూడ్డమే కాని ఎవ్వరూ ఇంటిదాకా రాలేదు. తన దౌర్భాగ్యానికి గుండె చెరువైపోయేది. తల్లిదండ్రులు బాధపడుతుంటే తన నాడపిల్లగా పుట్టించిన భగవంతుణ్ని దోషిగా నిలబెట్టేది. మెడలో మూడు ముళ్ళేసిన జనార్ధనం అపర జనార్ధనుడి స్థానం సంపాదించుకున్నాడావిడ గుండెల్లో.

శోభనం గదిలో....

అతని కళ్ళు, జుట్టూ, ముక్కు పెదాలమీద అందమైన మీసం కట్టును రెప్పవాల్చకుండా చూచిన ఆమెకళ్ళల్లో ఆశ, మెరుపు దొరవ తుళుక్కు మన్నాయి.

ప్రత్యేకంగా అలంకరించుకున్న డ్రస్సుల్లో అనూహ్య అవయవాల పొంకం స్ఫుటంగా, మరీ ఆకర్షణీయంగా కనబడుతోంది. ఉత్సాహం, ఉద్రేకం ఉరకలు వేస్తున్నాయి జనార్ధనంలో.

మల్లెపందిరి, అగరొత్తుల సువాసనలు మత్తెక్కిస్తున్నాయి హంసలా అడుగులేస్తూ దగ్గరైంది అనూహ్య భర్త గుండెన మీద

గువ్వలా ఒదిగిపోయింది-మల్లికా.

'అనూహ్య....!'

ఊఁ....!

'నేన్నీకెందుకు నచ్చాను?'

'మీకు నేనెందుకు నచ్చానో, మీరు నాకందుకే నచ్చారు.' అంది-చూపులతో తినేస్తూ.

'నేనొక టడుగుతాను....ఏమీ అకోవుగదూ!'

ఊఁహూఁ!

'నువ్వు కిడ్నాప్‌కు గురైనప్పటి అనుభవాలు వివరంగా చెప్పు....'

'.... ....'

'భార్యభర్తలమధ్య రహస్యాలుండొద్దుగదా!'

'నిజమే.... కాని నేను కిడ్నాప్‌కు గురయ్యాననీ, చెడిపోయాననీ మీరు నమ్ముతున్నారా?'

'స్వయంగా మీనాన్నే చెబితే నమ్మకేంజేస్తాను? అదేమన్నా అబద్ధమా?'

'ఔను'

షాక్ తగిలింది జనార్ధనంకు-నమ్మలేకపోయాడు.

'ఐతే....కన్నతండ్రే అలా ప్రచారం చేశాడెందుకూ?'

'విధిలేక'

'అంటే....!'

'మా ఊళ్ళో రాజకీయపక్షాలు ఆడపిల్లల జీవితాలతో ఆడుకుంటున్నాయి. ఊళ్ళో ఉన్న రెండువర్గాలలో మా నాన్న ఒక

వర్గానికి నాయకుడుగా ఉండేవాడొకప్పుడు. ఇప్పుడాయన కారాకీయాలకు దూరంగా ఉన్నా ప్రత్యర్థుల కోపాగ్నికి దూరంజ లేకపోయాడు. నా పెళ్ళి కాకుండాచేసి మా నాన్నను మానసిక సంక్షోభానికి గురిచెయ్యాలని మరోవర్గం ప్రయత్నం. నన్ను చూచేందుకొచ్చే వాళ్ళను ఊరి బయటే ఆపి నేను కిడ్నాప్‌కు గురయ్యాననీ, చెడిపోయాననీ నమ్మకంగాచెప్పి పంపించేవారు-ప్రత్యర్థులు. కనీసం వారిని మా ఇంటిదాకా గూడా రానిచ్చేవారు కాదు'

'అలాగా....? అప్రయోగం నామీదగూడా జరుపబోయారు'

'అందుకే మానాన్న ఎత్తుకుపైఎత్తు వేసి వారు చెప్పదలుచుకున్న విషయం తానే చెప్పడం ప్రారంభించాడు- ధైర్యమున్నవాడే ముందుకొస్తాడని. అందుకే మీకలా చెప్పాడు'

'ఐతే....నిజానికి....!'

'కిడ్నాప్ కథంతా కట్టుకథే'

అద్భుతమైన అనూహ్య కంటిపాపల్ని జనార్థనం పెదవులు కప్పేశాయి లైటు వెలుతురుకు సిగ్గేసి గదిలోంచి పారిపోయింది.

(జాగృతి 2 జూన్ 1991)